క్లుప్తంగా

డ్రెయినేజీ పూడికతీసి శానిటేషన్ చేపట్టాలి

రెబ్బెన: మండల కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీకి అనుకొని ఉన్న మురికికాలువలో పూడిక తీసి శానిటేషన్ పనులు చేపట్టాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. కాలనీలో విష జ్వరాలు ప్రబలుతుండడంతో మంగళవారం జెడ్పీటీసీ సంతోష్ వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శితో కలిసి కాలనీని సందర్శించారు. ఎంపీటీసీ పెసరు మదునయ్య, వైద్యాధికారి సుజిత్, రాజేశ్ పాల్గొన్నారు.

'మర్సుకోల సరస్వతికే టికెట్ కేటాయించాలి'

జైనూర్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఆదివాసీ బిడ్డ మర్సుకోల సరస్వతికే టికెట్ కేటాయించాలని, లేని పక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మండాడి లింగు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు కోటేశ్వర రావు, శేకు, ఆయ్యుబ్ పఠాన్, అమృత్, తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గ్రూప్ -1 పరీక్ష రద్దు'

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే గ్రూప్ -1 పరీక్ష రద్దయ్యిందని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి సతీశ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ నియామక పరీక్షలపై నిరుద్యోగులకు నమ్మకం పోయిందన్నారు. మండల సహాయ కార్యదర్శులు పురుషోత్తం, శివ, ఉపాధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ విజేత వేదిత

ఆసిఫాబాద్అర్బన్: గణేశ్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారదా గణేశ్ మండలి వద్ద నిర్వహించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ లక్కీడ్రాను కాగజ్‌నగర్‌కు చెందిన వేదిత గెలుచుకుంది. గణేశ్ మండలి అధ్యక్షులు రవి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, నిర్వాహకులు విజేతను బైక్‌ను అందజేశారు. నిర్వాహకులు వివేక్, ప్రశాంత్, మహేష్, ఆనంద్, శ్రీనివాస్, అశ్విన్, మంగ, రజని, విజ్ఞత తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

కాగజ్‌నగర్‌రూరల్: యువత సన్మార్గంలో నడుస్తూ ఆదర్శంగా నిలవాలని ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ అన్నారు. మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం మండలంలోని పాత సారసాల గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామాల్లోని ద్విచక్ర వాహనాల పత్రాలు తనిఖీ చేశారు.

రోడ్డుకు రైతు మరమ్మతులు



గుంతల్లో మొరం వేస్తున్న రైతు

చింతలమానెపల్లి: మండలంలోని బారెగూడ సీసీ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో మంగళవారం స్థానిక రైతు బోర్ల రమేశ్ ఎడ్ల బండిలో మొరం తెచ్చి గుంతల్లో మొరం వేసి మరమ్మతులు చేశారు. గుంతల కారణంగా ఎడ్లబండ్లు, ఆటోలు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో గుంతల్లో మొరం వేసినట్లు రైతు తెలిపాడు.

నిషేధిత పురుగు మందులు విక్రయించొద్దు

కెరమెరి: నిషేధిత పురుగు మందులు విక్రయించొద్దని మండల వ్యవసాయాధికారి గోపికాంత్ అన్నారు. మంగళవారం పలు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఏఈవో వెంకటేశ్, శ్వేత ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జైనూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్‌దారులకు పింఛన్ పత్రాలు అందించారు. అంతకు ముందు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ యాదవరావు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఆబుతాలిబ్, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: ప్రతి ఒక్కరూ బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ జీఎం ప్రసాద్ అన్నారు. మంగళవారం రైతువేదికలో లబ్ధిదారులకు ప్రమాద బీమా చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొమ్ముగూడ గ్రామానికి చెందిన ఎస్. కమల్ అనే ఖాతాదారుడి ప్రమాద బీమా రూ.20లక్షల చెక్కును అతని కుమార్తె శకుంతులకు అందించినట్లు తెలిపారు.

'ఓటింగ్' పెంచడమే లక్ష్యం..!

- ఈవీఎంల వినియోగంపై విస్తృత ప్రచారం
- గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- పెరిగిన ఓటర్ల సంఖ్య



రాంపూర్ పంచాయతీలో ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ ప్రేంకిరణ్

రెబ్బెన: ఎన్నికల ప్రక్రియలో బ్యాలెట్ బాక్స్ స్థానంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు రంగప్రవేశం చేశాయి. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు, వృద్ధులకు ఈవీఎంలపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. ఓటు ఎవరికి వేస్తున్నారో, వేసిన ఓటు ఎవరికి పడిందో తెలుసుకోలేకపోయేవారు. ఇలాంటి వారి సమస్యలను అధిగమించడంతో పాటు రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మొబైల్ వాహనం ద్వారా గ్రామాలకు..

ఎన్నికల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ఎన్నికల అధికారులు ప్రజల వద్దకే ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాలు తీసుకెళ్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. మొబైల్ వాహనంలో ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాలు ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరును ఓటర్లకు వివరిస్తున్నారు. తమకు నచ్చిన అభ్యర్థికి ఎలా ఓటు వేయాలి.. ఓటు వేసే సమయంలో పరిశీలించాల్సిన అంశాలతో పాటు, ఓటు వేసిన అనంతరం ఓటు ఏ అభ్యర్థికి వేశామో చూసుకునేలా వీవీ ప్యాట్‌ను ఎలా ఉపయోగించాలో వివరిస్తున్నారు.

ఓటు హక్కుపై ప్రచారం..

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండేలా ఓటు హక్కు నమోదుపై అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ఐ ఓట్ ఫర్ షూర్ అనే నినాదంతో గత నెలలో మండలస్థాయి 5కే రన్‌ను గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి నూతన ఓటరు ముసాయిదా జాబితాలను ప్రజలకు చదివి వినిపించారు. దీంతో మండలంలో సుమారు 2250 మంది కొత్త ఓటర్లు పెరిగారు. గతంలో మండలంలో మొత్తం 27,062 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 13,881, మహిళలు 13,181 మంది ఉన్నారు. తాజాగా పెరిగిన ఓటర్లతో మండలంలో మొత్తం ఓటర్ల సంఖ్య 29,312కు చేరుకుంది.

> **ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలి**
>
> అర్హులైన ప్రతీ దేశ పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండాలి. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలి. ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. మండలంలో సుమారు 2250 మంది కొత్త ఓటర్లు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. – **వరలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్**

నిమజ్జనం.. జాగ్రత్తలు అవసరం

- గణేశ్ శోభాయాత్రల్లో అల్లర్లు వద్దు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచనలు
- నేడు, రేపు నిమజ్జనోత్సవాలు



గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు (ఫైల్)

కెరమెరి: మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గణపతులను ప్రతిష్ఠించి ప్రతీరోజు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా భక్తులు నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. చాలాచోట్ల గణేశ్ మండపాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా గణపయ్య నిమజ్జనాన్ని నేడు, రేపు నిర్వహించనున్నారు.

అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం..

వినాయక నిమజ్జనోత్సవంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. మండలంలోని చెరువులు, మండల కేంద్రంలో కెస్లాగూడ ప్రాజెక్టు, అమ్మన్నమడుగుతో పాటు, సాంగ్వి పెద్దవాగులో భారీగా నీళ్లు చేరాయి. వినాయక నిమజ్జనం సమయంలో మద్యం మత్తులో ఉండి ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. వాగులు, చెరువుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేటి నుంచి నిమజ్జనం

అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జన కార్యక్రమాలు నేటి నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 44 గణపతులను భక్తులు ప్రతిష్ఠించారు. ఆయా ప్రతిమలను మండల కేంద్రంలోని అమ్మన్నమడుగు ప్రాజెక్టులో, సుల్తాన్‌గూడ పెద్దవాగులో నిమజ్జనం చేయనున్నారు. మరికొన్ని విగ్రహాలను సాంగ్వి పెద్దవాగులో, గయాగాం, ధనోరా గణపతులను గోయగాం, అంబారవు గూడల మధ్యలో ఉన్న వాగులో, అనార్‌పల్లి, దేవాపూర్ గ్రామాలకు చెందిన వారు అనార్‌పల్లి వాగులో నిమజ్జనం చేస్తారు. ఆయా ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులకు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిమజ్జనం వేళ మద్యం దుకాణాలు మూసి వేయాలని ఎక్సైజ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

> **శాంతియుతంగా జరపాలి**
>
> 
>
> నేడు, రేపు మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా జరపాలి. ఎలాంటి అల్లర్లు చేయవద్దు. మద్యం సేవించి ఉత్సవంలో పాల్గొనరాదు. డీజేలకు అనుమతి లేదు. – **గుంపుల విజయ్, ఎస్సై**

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీల నిరసన



దహెగాం: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దహెగాం: న్యాయమైన డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలు వజ్రమ్మ, కలహన, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: గత 16 రోజులుగా అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులు బతుకమ్మలతో నిరసన తెలిపారు.

బీజేపీ నాయకుల మద్దతు..

అంగన్‌వాడీల దీక్ష శిబిరాన్ని మంగళవారం మండల బీజేపీ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌చౌదరి, జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్అర్బన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ డిమాండ్లను నెరవేర్చాలని కలెక్టరేట్ ఎదుట కొనసాగిస్తున్న నిరవధిక దీక్షలు మంగళవారం 16వ రోజుకు చేరుకున్నాయి. సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, సువర్ణ, మమత, సూర్యమణి, లక్ష్మి, సులోచన పాల్గొన్నారు.

కౌటాల: సమ్మెలో భాగంగా 16వ రోజు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అంగన్‌వాడీలు నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్, కుమురంభీం, జ్యోతి బాపూలే విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



కాగజ్‌నగర్‌టౌన్: ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప



సిర్పూర్(టి): చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారకానగర్‌లో గల దోబీఘాట్ వద్ద చాకలి ఐలమ్మ నూతన విగ్రహాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం ఆవిష్కరించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. ఈ సందర్భంగా రజక సంఘం భవనానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తూ సంఘం నాయకులకు కాపీ అందజేశారు. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు జంగలపల్లి రాజేశ్, సంఘం సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గుంటూరుకాలనీలో..

పట్టణంలోని వార్డ్ నం.1 గుంటూరు కాలనీలో చాకలి ఐలమ్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి శివ, ఆనంద్, సీనియర్ సభ్యులు రాజాలింగం పాల్గొన్నారు.

ఆసిఫాబాద్అర్బన్: తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నార్ రమేశ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ జయంతికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పురుషోత్తం, ప్రణయ్, ప్రశాంత్, సాయికృష్ణ, తరుణ్, సిద్దార్థ, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని బస్టాండ్, డౌనల్ ప్రాంతాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా జరుపుకున్నారు. చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డౌనల్ ప్రాంతంలోని రజక కాలనీలో మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, రజక సంఘం నాయకులు చంద్రగిరి తులసీదాస్, హన్మంతు, ప్రశాంత్, సుమన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి

కెరమెరి: విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్ది భవితకు బాటలు వేయాలని ఏసీఎంవో (జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి) పుర్కు ఉద్ధవ్ అన్నారు. మంగళవారం మండలంలోని హట్టి, జోడేఘాట్, బాబేఝరి ఆశ్రమ ఉన్నత పాఠశాలలతో పాటు టోకెన్‌మోవాడ్, పెద్ద పాట్నాపూర్, చిన్న పాట్నాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా బడుల్లో కొనసాగుతున్న 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' అనే వంద రోజుల కార్యక్రమాన్ని పరిశీలించారు. డీఆర్‌పీ వామన్‌రావు, ఎస్సీఆర్‌పీ శ్యాంరావు, హెచ్‌ఎంలు ప్రేందాస్, జంగు, మోతిరాం తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బెజ్జూర్: మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా మత్స్యకారులకు అందిస్తున్న చేప, రొయ్య పిల్లల పంపిణీ చేసే కార్యక్రమాన్ని కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. మంగళవారం మండల కేంద్రంలోని గొల్లబాయి చెరువులో చేప, రొయ్యలను విడుదల చేశారు. జెడ్పీటీసీ పుష్పలత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సకారాం, జిల్లా మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు భానుప్రసాద్, అధికారి విజయ్ కుమార్, డైరెక్టర్ ఇస్తారి నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరుపుకోవాలి

రెబ్బెన: మండలంలోని ప్రజలు ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్సై చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని గంగాపూర్ వాగులో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశాలను మంగళవారం పరిశీలించారు. నాయకులు మదునయ్య, ఎలక్ట్రికల్ సిబ్బంది మధు తదితరులు పాల్గొన్నారు.

మాంగ్ సమాజ్ కార్యవర్గం ఎన్నిక

కెరమెరి: మండల మాంగ్ సమాజ్ కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మొహాలే దత్తా మాంగ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మండలాధ్యక్షుడిగా కోటంగే వెంకటి(కోట), ఉపాధ్యక్షులుగా శివాజి(లేండిగూడ), ప్రధాన కార్యదర్శిగా సురేశ్(గౌరి), సంయుక్త కార్యదర్శిగా అశోక్(కెలిబి), కోశాధికారిగా పరమేశ్వర్(నారాయణగూడ), సలహాదారులుగా బాలాజి(కెరమెరి), సభ్యులుగా మోరే బాలాజి, లక్ష్మణ్, మాధవ్, పరుశురామ్, రజినీకాంత్, బాపూలను ఎన్నుకున్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

జైనూర్: ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ డీఎంహెచ్‌వో కుమ్ర బాలు అన్నారు. మంగళవారం మండలంలోని రాసిమెట్ట గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కళాజాత సంఘం సభ్యుల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం రోగులకు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది అపూర్వ, అమ్రిన్, ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడ వెంకటేశ్, సర్పంచి సయాయజీ, కార్యదర్శి మారుతి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కవిత మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కౌటాల రైతువేదిక భవనంలో మహిళ సంఘాల సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఏపీఎం వెంకటరమణ, ఎంపీవో మోనిక, మహిళ సంఘం మండలాధ్యక్షురాలు కమలాబాయి, కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వంజీరిలో 'స్వచ్ఛతా హీ సేవా'

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ గ్రామస్తులకు సూచించారు. ఎంపీవో గౌరీశంకర్, సర్పంచ్ రమేశ్, కార్యదర్శి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆడే ప్రకాశ్ సేవలు అభినందనీయం

కెరమెరి: కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఆడే ప్రకాశ్ సేవలు అభినందనీయమని ఎంఈవో కుడ్మెత సుధాకర్ అన్నారు. మంగళవారం జెడ్పీఎస్ఎస్ కెరమెరి పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ఆయనను ఎంఈవో, ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎంలు చంద్రశేఖర్, సత్యనారాయణ, రతన్, భాస్కర్, రంగయ్య, తిరుమలేశ్ ఉన్నారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



రెబ్బెనలో ఆశా వర్కర్లకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: గ్రామాల్లో విశేష సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బీజేపీ అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం ఆశా వర్కర్ల దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, దళిత మోర్చా మండల అధ్యక్షుడు నందకిషోర్ పాల్గొన్నారు.

దహెగాం: ఆశా కార్యకర్తల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఆశా కార్యకర్తలు శోభ, పుష్ప, సులభ, మమత, సంగీత, సుజాత, వనిత, రజిత, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా సంఘం మండల అధ్యక్షురాలు మోగ్ర డిమాండ్ చేశారు. మండలంలోని ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకటరమణ

రెబ్బెన: సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి న్యాయం జరిగేలా చూడాలని డీఎస్పీ ఎం.వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూంలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

గణనాథుడికి కుంకుమ పూజలు



ఆసిఫాబాద్: సాయినివాడలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



రెబ్బెన: గణనాథుడికి పూజలు చేస్తున్న మహిళలు

జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో, గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మహిళలు వినాయకులకు కుంకుమ పూజలు చేశారు. గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని భగత్‌సింగ్ రోడ్డు వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడిని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రెబ్బెనలోని శ్రీరామ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపయ్యకు 56 రకాల ప్రసాదాలను నైవేద్యాలుగా సమర్పించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రామాలయంలో సీఐ రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. శివకేశవ మందిర్‌లోని గణేశ్ మండలి వద్ద కూరగాయలతో దండలు అలంకరించారు. కౌటాల మండల కేంద్రంలోని కౌండిన్య గణేశ్ మండలి వద్ద మండల కోఆప్షన్ సభ్యులు అజ్మత్ అలీ అన్నదానం చేసి మతసామరస్యం చాటుకున్నారు. – దహెగాం/కాగజ్‌నగర్‌టౌన్/ రెబ్బెన/ఆసిఫాబాద్ /కౌటాల

'కష్టపడి పనిచేస్తే సింగరేణిలో భవిష్యత్తు'



నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన: కష్టపడి పనిచేసే ఉద్యోగులకు సింగరేణి సంస్థలో మంచి భవిష్యత్తు ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఇద్దరు ఉద్యోగుల వారసులకు, నలుగురు భూ నిర్వాసితులకు ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఏజీఎం తిరుమల్‌రావు, డీవైపీఎం తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.